# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 21-05-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా నిన్న ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 49 నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది.**
2. **ఆంధ్ర ప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత జరిగిన ఘర్షణలపై స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ సిట్ ప్రాథమిక దర్యాప్తు పూర్తి చేసింది.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో రేపటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు స్పెషాల్టీ ఆస్పత్రుల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది.**
4. **ధాన్యం కొనుగోళ్లపై పూర్తి బాధ్యత కలెక్టర్లకే అప్పగిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.**
5. **ఇరాన్ అధ్యక్షులు ఇబ్రహీం రైసీ మృతికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ భారత్ ఈరోజు సంతాప దినంగా ప్రకటించింది.**

==========================

లోక్‌సభ ఎన్నికల అయిదవ దశ పోలింగ్ నిన్న ముగిసింది. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 49 నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది. నిన్న సాయంకాలం ఏడు గంటల వరకు దాదాపు 57.38 శాతం మేర పోలింగ్ నమోదైందని ఎన్నికల సంఘం తెలిపింది. అత్యధికంగా పశ్చిమ బంగాలో 73 శాతం, అత్యల్పంగా మహారాష్ట్రలో 48.88 శాతం మేర ఓటింగ్ నమోదైంది. దేశంలో మొత్తంగా 543 లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. అయిదో దశతో కలిపితే మొత్తం 428 సీట్లకు పోలింగ్ పూర్తయ్యింది. ఈ మేర ఇప్పటివరకు నాలుగు దశల్లో జరిగిన ఎన్నికల్లో మొత్తం 66.95 శాతం మేర పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత జరిగిన ఘర్షణలపై స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ సిట్ ప్రాథమిక దర్యాప్తు పూర్తి చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు, నరసరావుపేట, తాడిపత్రి, తిరుపతిలో జరిగిన ఘటనలపై సిట్ అధికారులు ముమ్మరంగా దర్యాప్తు జరిపారు. 33 హింసాత్మక ఘటనలు జరిగినట్లు సిట్ అధికారులు గుర్తించారు. హింసాత్మక ఘటనలపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కూడా వారు పరిశీలించారు. 150 పేజీలతో కూడిన సుదీర్ఘ నివేదికను డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకు అలాగే రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి

ముఖేష్ కుమార్ మీనాకు సిట్ ప్రధాన అధికారి బ్రిజ్ లాల్ సమర్పించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రేపటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు స్పెషాల్టీ ఆస్పత్రుల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి నిన్న ఓ లేఖ రాసింది. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ పథకం సంచాలకులు లక్ష్మీ షాకు రాసిన ఈ లేఖలో పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడాన్ని ప్రస్తావించింది. రేపటి నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేస్తామని స్పష్టం చేసింది. గత ఏడాది ఆగస్టు నుంచి ఉన్న 15 వందల కోట్ల రూపాయల పెండింగ్ బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేసింది. సుదీర్ఘ కాలంగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లోనే తాము ఈ నిర్ణయం తీసుకోవాల్సి వస్తోందని స్పెషాల్టీ ఆస్పత్రుల సంఘం తెలిపింది.

---------------------------

ధాన్యం కొనుగోళ్లపై పూర్తి బాధ్యత కలెక్టర్లకే అప్పగిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నిన్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన  జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైతులకు నష్టం వాటిల్లకుండా చివరి ధాన్యం గింజ వరకూ కొనాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్‌బాబు నిన్న పాత్రికేయులకు వెల్లడించారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే సేకరించాలని నిర్ణయించినట్లు వారు వెల్లడించారు. వానాకాలం పంట నుంచి సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల మేర బోనస్ ఇవ్వాలని తీర్మానించినట్లు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు ముందుకు వెళ్లాలని నిర్ణయించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణకు 600 కోట్ల రూపాయలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

---------------------------

ఇరాన్ అధ్యక్షులు ఇబ్రహీం రైసీ మృతికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ భారత్ ఈరోజు సంతాప దినంగా ప్రకటించింది. ఇరాన్ అధ్యక్షులు ఇబ్రహీం రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ తూర్పు అజర్ బైజాన్ ప్రావిన్సులోని దట్టమైన అటవీ ప్రాంతంలో కుప్పకూలిన నేపథ్యంలో ఆయన మరణించారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో ఇరాన్ ప్రజలకు వెన్నంటి ఉంటామని విదేశీవ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.

---------------------------

విజయనగరం జిల్లాలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. భోగాపురం అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డు విమానాశ్రయ నిర్మాణ పనులను ఆయన నిన్న పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న టెర్మినల్ భవనం, రన్‌వే, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్ భవనాలు, ఇతర నిర్మాణ పనులు జరుగుతున్న స్థలాలను ఆయన సందర్శించారు. నిర్మాణ పనులకు సంబంధించిన అంశాలను  విమానాశ్రయ నిర్మాణ సంస్థ ప్రతినిధులు వివరించారు. ఇప్పటివరకు జరిగిన పనులపై జవహర్ రెడ్డి సంతృప్తిని వ్యక్తం చేశారు.

---------------------------

పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ గణితం పూర్తయిన విద్యార్థులు లేటరల్ ఎంట్రీ ద్వారా బీటెక్, బీఫార్మసీ

రెండో ఏడాదిలో ప్రవేశానికి నిర్వహించిన తెలంగాణ ఈసెట్‌లో 95.86 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 11 బ్రాంచీల్లో ప్రవేశాలకు 23 వేల 330 మంది ఈసెట్ రాశారు. వారిలో 22 వేల 365 మంది కౌన్సెలింగ్ ద్వారా కన్వీనర్ కోటాలో సీట్లు పొందేందుకు అర్హత సాధించారు. ఈసెట్ ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఛైర్మన్ ఆర్.లింబాద్రి, సెట్ ఛైర్మన్, ఉపాధ్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి రవీందర్ నిన్న విడుదల చేశారు.

---------------------------

తెలంగాణ రాష్ట్రంలో నిన్న ప్రారంభమైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ పేపర్-2 గణితం, సైన్స్‌కు తొలిరోజు కేవలం 77.81 శాతం మంది హాజరయ్యారు. మొత్తం 34 వేల 436 మందికి గాను 26 వేల 796 మంది పరీక్ష రాశారు. సొంత జిల్లాల్లో కాకుండా దూరంగా ఉన్న ఇతర జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో 22శాతం మంది పరీక్షకు హాజరు కాలేదని అధికారులు తెలిపారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం కొన్ని పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నరసరావుపేట, గురజాల, తిరుపతి, తాడిపత్రి సబ్‌డివిజన్లకు కొత్త డీఎస్పీలను ఎన్నికల సంఘం నియమించింది. వీరితోపాటు మరికొన్ని స్థానాల్లోనూ నియామకాలు చేపట్టింది. పోలింగ్ రోజున, ఆ తర్వాత చెలరేగిన హింసాకాండకు బాధ్యుల్ని చేస్తూ ఎన్నికల సంఘం మొత్తం 12 మంది డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలను సస్పెండ్ చేసింది. వారి స్థానంలో ఈ కొత్త అధికారులను నియమించింది.

---------------------------

జపాన్‌లోని కోబెలో జరుగుతున్న ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన జీవాంజి దీప్తి బంగారు పతకం కైవసం చేసుకున్నారు. నిన్న మహిళల టీ20 400 మీటర్ల పరుగును దీప్తి 55.07 సెకన్లలో పూర్తిచేసి అగ్రస్థానంలో నిలిచారు. ఈ క్రమంలో 20 ఏళ్ల దీప్తి.. గత ఏడాది పారిస్‌లో బ్రెనా క్లార్క్ నమోదు చేసిన 55.12 సెకన్ల రికార్డును అధిగమించి పారిస్ పారాలింపిక్స్‌కు అర్హత సాధించారు.

---------------------------

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం తుపానుగా బలపడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతి వాతావరణ కేంద్రం ప్రకటించింది. తుపానుగా బలపడిన తర్వాత ఒడిశా, పశ్చిమబెంగాల్ తీరాల వైపు పయనించే అవకాశం ఉందని... దీంతో ఆంధ్రప్రదేశ్‌కు తుపాను ముప్పు లేదని వాతావరణ నిపుణులు తెలిపారు. బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు ద్రోణి ప్రభావంతో రాబోయే నాలుగురోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని ఈరోజు పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి వానలు పడతాయని తెలిపింది. 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, పిడుగులు పడే అవకాశముందని హెచ్చరించింది.

నైరుతి రుతుపవనాలు వచ్చే నెల 5వ తేదీ నుంచి 11వ తేదీల మధ్య తెలంగాణ రాష్ట్రాన్ని తాకనున్నాయి. ఈ ఏడాది నైరుతి గమనం సానుకూలంగా ఉండటంతోపాటు ఈ నెలాఖరునే కేరళను తాకనున్నాయి. అక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ మీదుగా తెలంగాణను చేరుకోవడానికి కనీసం అయిదారు రోజుల సమయం

పడుతుంది. కొంత ఆలస్యమైతే జూన్ రెండో వారంలో రాష్ట్రమంతటా విస్తరిస్తాయని వాతావరణశాఖ నిపుణులు సూచిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 1 లక్ష 61 వేల 877 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు దేవానందరెడ్డి నిన్న ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకు పరీక్షలు జరగనున్నాయని, విద్యార్థులను ఉదయం 8 గంటల 45 నిమిషాల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని వెల్లడించారు. హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ నెల 24, 25, 27 తేదీల్లో మొదటి, ద్వితీయ, తృతీయ భాషా సబ్జెక్టులు... 28, 29, 30, 31 తేదీల్లో గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం పరీక్షలు ఉంటాయని.. జూన్ 1, 3 తేదీల్లో ఓఎస్ఎస్ పేపర్-1, 2 నిర్వహిస్తున్నామని వివరించారు.

======================